సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 4 । ఏప్రిల్ । 2024



ఓటు నమోదుకు త్వరపడాలి

ఓటరుగా నమోదు కావడానికి ఈనెల 15వ తేదీ వరకు భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలి. - 8లో

రంజాన్ వేళలు

		ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
రాయచోటి	:	6.30	4.51
రాజంపేట	:	6.32	4.50
పీలేరు	:	6.35	4.45
మదనపల్లె	:	6.33	4.54

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.160	రూ.248

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 65 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	465	470
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 240.220 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ఎంపీగా మేడా ప్రమాణ స్వీకారం

రాజంపేట: రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన మేడా రఘునాథరెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 11 గంటలకు పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసేందుకు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. కాగా రాష్ట్రం నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తుండగా, అందులో అన్నమయ్య జిల్లాకు చెందిన తొలి ఎంపీ మేడా రఘునాథరెడ్డి కావడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సదా రుణపడి ఉంటానన్నారు. జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానన్నారు.

రేపటి నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు



రాజంపేట: ఈనెల 5 నుంచి 8వరకు పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 521వ వర్ధంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. తాళ్లపాక, అన్నమాచార్య 108 అడుగుల విగ్రహం వద్ద టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. తాళ్లపాకలో 5న అన్నమాచార్య ధ్యానమందిరంలో సంకీర్తనాగోష్ఠిగానం ఉంటుంది. టీటీడీ కళాకారులచే సంగీత కార్యక్రమాలు ఉంటాయి.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు ఆర్‌సెటి డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల లోపు కలిగిన యువతకు 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు.వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల 22 నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.


నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు పొందడానికి దరఖాస్తు స్వీకరణ గడువును ఈనెల 4వ తేదీతో ముగియనుంది. ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 8వ తేదీ వరకు ఉందని, విద్యార్థుల అభ్యర్థన మేరకు విశ్వవిద్యాలయ అధికారులు రెండు దఫాలు తేదీలను పొడిగించినట్లు వైవీయూ అధికారులు తెలిపారు. వివిధ డిగ్రీల పట్టాల కోసం 11,725 మంది విద్యార్థులు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

ఎడెక్స్ కోర్సులో నమోదుకు స్పందన

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని ఎడెక్స్ అందించే కోర్సులలో నమోదు కేంద్రాన్ని (లైసెన్స్ యాక్టివేషన్ అండ్ కోర్సెస్ ఎన్‌రోల్‌మెంట్ హెల్ప్‌లైన్ సెంటర్)ను ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి పరిశీలించారు. బుధవారం విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఈ నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సుల్లో 400 మంది ఫ్యాకల్టీ, విద్యార్థులు వారి పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. కోర్సులో చేరడం ద్వారా ప్రముఖ యూనివర్సిటీల ఫ్యాకల్టీల లెక్చర్స్ వీడియోలు చూడటంతో పాటు మెటీరియల్స్‌ను ఉచితంగా పొందవచ్చన్నారు.

వైవీయూ కామర్స్ డీన్‌గా ఆచార్య సుబ్బరాయుడు



ఆచార్య వై. సుబ్బరాయుడుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్, లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా ఎంబీఏ ఆచార్యులు ఆచార్య వై. సుబ్బరాయుడును నియమితులయ్యారు. ఈయనకు నియామక పత్రాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన ఆచార్య టి. శ్రీనివాస్ పదవీకాలం పూర్తవడంతో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. నూతన డీన్‌గా నియమితులైన ఆచార్య సుబ్బరాయుడు మూడు సంవత్సరాల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు.

ఎంతపని చేశావ్.. బాబూ



ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారకముందే ఇంటి తలుపు తట్టి వలంటీర్లు అవ్వాతాతలకు పింఛన్లు అందజేసేవారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో దీన్ని సాకుగా చూపి టీడీపీ అధినేత చంద్రబాబు తన అనుయాయుల చేత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. ఫలితంగా పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా పెట్టాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఇది వృద్ధుల పాలిట శాపంగా పరిణమించింది. ప్రతిపక్ష పార్టీ కుట్రలకు అమాయక అవ్వాతాతలు బలవుతున్నారు.

- పగవానికి కూడా ఈ కష్టాలు రావద్దంటూ పండుటాకుల ఆవేదన
- చంద్రబాబు కుట్రలకు బలి పశువులుగా మారుతున్న వృద్ధులు
- వలంటీర్ల ద్వారా పంపిణీ జరగకుండా బాబు పన్నాగం
- జిల్లా వ్యాప్తంగా సచివాలయాల వద్ద వృద్ధుల పడిగాపులు
- చాలాచోట్ల క్యూలైన్లలో నిలబడి పింఛన్ తీసుకుంటున్న వైనం
- పింఛన్‌దారులకు తప్పని తిప్పలు



మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయంలో పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు



సాక్షి రాయచోటి: పింఛన్ల కోసం పండుటాకులు పడుతున్న కష్టం చూస్తే అయ్యో పాపం అనక మానరు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితే ఉండేది. మండు వేసవిలో.. మిట్ట మధ్యాహ్నం వారు పడుతున్న వేదన చూస్తే మానవత్వం ఉన్న ఎవరైనా చలించిపోతారు. గతంలో ఎన్నో ఏళ్ల నుంచి ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రతినెల 1వ తేదీ కోడికూత కూయగానే ఇంటికి వెళ్లి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేసేవారు. వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందన్న రాజకీయ కుట్రలకు తెర తీసిన బాబు తన ఆంతరంగిక అనుయాయుల ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయించి తన నిజస్వరూపాన్ని బయట పెట్టారు. ఇంటిలో నుంచి బయటికి రావడం సాధారణ ప్రజలకే ప్రస్తుత వేసవి కాలంలో ఇబ్బందిగా ఉంది. అలాంటిది కాళ్లు, చేతులు అంతంత మాత్రంగా పనిచేసే పండుటాకులకు ఒక్కసారిగా సచివాలయానికి వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలని చెప్పేసరికి తల్లడిల్లిపోతున్నారు. ఎప్పుడూ లేని ఇలాంటి దారుణ పరిస్థితి దాపురించేందుకు కారణమైన టీడీపీతోపాటు బాబును వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు శాపనార్థాలు పెడుతున్నారు.

అయ్యో.. ఎంత కష్టం!

వేసవి కాలం.. అందులోనూ ఏప్రిల్ నెల కావడంతో ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. మరో వైపు వాతావరణ శాఖ ఇళ్లకే పరిమితం కావాలని.. బయటికి వస్తే వడగాల్పులతో ఇబ్బందులు తప్పదని హెచ్చరిస్తోంది. అయినా బాబు పన్నాగంతో పండుటాకులకు కష్టమొచ్చి పడింది. ఇంటి నుంచి సచివాలయాలకు వెళ్లాలన్నా కూడా వృద్ధులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నడిచి పోవాలంటే కష్టంగా మారడంతో కొంతమంది సహాయకుల ద్వారా, ద్విచక్ర వాహనాల్లో వెళ్లారు. మరికొంతమంది కుటుంబీకుల సహాయం తీసుకుని నడుచుకుంటూ వెళ్లారు. ప్రధానంగా మదనపల్లె, రాజంపేట, రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె, రైల్వేకోడూరులలో కొన్ని సచివాలయాల వద్ద బారులు తీరి నిరీక్షించాల్సి వచ్చింది. మరికొన్ని సచివాలయాల్లో మధ్యాహ్నం నుంచి పంపిణీకి శ్రీకారం చుట్టారు. అయితే గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతోపాటు తాగునీటికి చాలా చోట్ల ఇబ్బందులు పడ్డారు. సచివాలయాల వద్దనే కొంతమంది నిరీక్షించలేక, ఎండకు ఇంటికి వెళ్లలేక అక్కడ తల వాల్చారు. ఓబులవారిపల్లె మండలం కొర్లకుంటకు చెందిన వృద్ధురాలు తులశమ్మ కిందపడటంతో గాయాలయ్యాయి.



మదనపల్లె మున్సిపాలిటీ అమ్మచెరువు మిట్ట సచివాలయం వద్ద క్యూలో నిలబడిన పింఛన్‌దారులు

మళ్లీ ఆందోళన మొదలైంది



నాకు కళ్లు కనపడవు. ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడంతో దర్జాగా తీసుకునేవాళ్లం. మాలాంటి వారికి ఈ ఐదు సంవత్సరాలు ఏ కష్టమూ తెలియలేదు. మంచి, చెడ్డా అన్నీ వలంటీర్ చూసుకొనేవారు. ఇప్పుడు ఎన్నికల పుణ్యమా అని ముఖ్యమంత్రి జగన్‌పై ఉన్న కోపంతో వలంటీర్ల సేవలు నిలుపుదలచేశారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయానికి వెళ్లి , అక్కడా ఇవ్వకపోతే మరుసటిరోజు వెళ్లి గంటల కొద్ది వేచి ఉండి తీసుకెళ్లేవాళ్లం. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి వస్తుందేమోనని ఆందోళనగా ఉంది.

– శ్రీనివాసులు, అంధుడు, శెట్టిపల్లె కస్బా, సంబేపల్లె మండలం

చంద్రబాబుకు ఉసురు తప్పదు



చంద్రబాబు నాయుడుకు మాలాంటి వికలాంగుల ఉసురు తప్పదు. జగనన్న హయాంలో ప్రతి నెలా 1వ తేదీ ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్లు అందజేసేవారు. చంద్రబాబు మద్దతుదారుల ఫిర్యాదుతో ఇంత వరకు 3వ తేదీ దాటినా పింఛన్ అందుకోలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది.

– ఈ.రమణ, దిగువగొట్టివీడు, చిన్నమండెం మండలం

అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది



చంద్రబాబు చేసిన పాపాలతో మేము పింఛన్ నగదు కోసం అధికారుల చుట్టూ మళ్లీ తిరగాల్సి వస్తోంది. మండుతున్న ఎండలకు సచివాలయం వద్దకు వెళ్లి క్యూలో నిలబడి పింఛన్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో వలంటీర్లు ఇంటి వద్దకు ఉదయాన్నే వచ్చి తలుపు తట్టి పింఛన్ అందజేసేవారు. చంద్రబాబు చేసిన అన్యాయానికి మేము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

–జి.చిన్నప్ప, కేశాపురం, చిన్నమండెం మండలం


21.39 శాతం పంపిణీ

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 2,25,131 మందికిగాను ఇప్పటివరకు 48,148 మందికి పంపిణీ చేశారు. మొత్తం మీద 21.39 శాతం మాత్రమే పంపిణీ చేశారు. జిల్లాలోని 500 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ పంపిణీ కొనసాగింది. పింఛన్ల పంపిణీ రెండు మూడు రోజుల్లో పూర్తయ్యేలా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ఏది ఏమైనా ఎప్పుడూ లేని కష్టతర పరిస్థితులు ప్రస్తుతం పింఛన్‌దారులు ఎదుర్కొంటున్నారు.

ఈ పాపం.. ఎవరిది!

- మదనపల్లి నియోజకవర్గం నిమ్మనపల్లె మండలం, రాచవేటి వారి పల్లె గ్రామానికి చెందిన నల్లంరెడ్డి గారి కృష్ణారెడ్డి భార్య ఎస్.రాజమ్మ (85), భర్త మరణానంతరం వృద్ధాప్య పింఛన్ పొందుతూ దివ్యాంగుడైన తన కుమారుడు అశోక్ రెడ్డితో కలిసి ఉండేది. పింఛన్ కోసం ఆమె తన ఇంటికి అర్ధ కిలో మీటర్ దూరంలో ఉన్న సచివాలయం వద్దకు నడిచి వెళుతూ ఉండగా, మార్గ మధ్యంలోని తిమ్మారెడ్డి ఇంటి సమీపంలో రోడ్డు పైనున్న రాయి కాలికి తగలడంతో, నిలువరించుకోలేక ముందుకు పడింది.అక్కడికక్కడే మృతి చెందింది.
- ఓబులవారిపల్లె మండలంలోని కొర్లకుంట సచివాలయంలో పింఛన్ కోసం వెళ్లిన పోలి తులసమ్మ అనే వృద్ధురాలు కింద పడటంతో చేయివిరిగింది.
- గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దిగువతొట్లివారిపల్లెలో పింఛన్ అందుతుందో లేదోననే ఆందోళనతో టి. మంగమ్మ(68) అనే వృద్ధురాలు గుండె ఆగి మరణించింది.

బాబు పాపాలు పండే రోజొచ్చింది



రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి

ఓబులవారిపల్లె: చంద్రబాబు నాయుడు పాపాలు పండే రోజొచ్చిందని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. ఓబులవారిపల్లెలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కష్టాలు తెలుసుకుని అధికారంలోకి వచ్చాక అవ్వాతాతలు కష్టపడకూడదే ఉద్దేశంతో వలంటరీ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఇంటి వద్దకే పింఛన్ తీసుకొచ్చి ఇచ్చేవారన్నారు. చంద్రబాబు కుట్ర కారణంగా నేడు వృద్ధులు సచివాలయాల వద్ద ఎండలో నిలుచుకొని ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి కుతంత్రాలు చేసే చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారన్నారు.

చంద్రబాబుకు అవ్వాతాతల ఉసురు తప్పదు



మాట్లాడుతున్న ఆకేపాటి

రాజంపేట : టీడీపీ అధినేత చంద్రబాబుకు రాష్ట్రంలో లక్షలాది మంది అవ్వాతాతల ఉసురు తప్పక తగులుతుందని జెడ్పీ చైర్మన్, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం నందలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ధైర్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక జతకట్టిన చంద్రబాబును ప్రజలు చీదరించుకున్నారు. నిమ్మగడ్డ లాంటి వ్యక్తులను అడ్డంపెట్టుకొని చంద్రబాబు చేస్తున్న కుట్రలకు పేదల బలవుతున్నారన్నారు. 1వతేదీ సూర్యుడు రాక ముందే పింఛన్ తీసుకునే వయోవృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇప్పుడు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు కల్పించింది చంద్రబాబునాయుడే అని రాష్ట్రవ్యాప్తంగా పేదలు దుమ్మెత్తిపోస్తున్నారన్నారు. వలంటీర్లు చూస్తే చంద్రబాబు అండ్ కోకు భయం పట్టుకుందని, అందుకే వలంటీర్లనూ దూరం పెట్టాలని ఎన్నికల సంఘానికి తన ఏడుపుతో గగ్గోలు పెట్టారన్నారు.

మండుతున్న ఆంధ్రా ఊటీ!



నిర్మానుష్యంగా గాలిబండ

- హార్సిలీహిల్స్‌పై బుధవారం ఉష్ణోగ్రత 33 డిగ్రీలు
- వేసవిలో ఇక్కడ సాధారణ ఉష్ణోగ్రత 27 డిగ్రీలకు లోపే
- ఏసీలు, ఫ్యాన్లు లేకుంటే ఉండలేని పరిస్థితి
- పర్యాటకుల్లేక బోసిపోతున్న కొండ

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ పేరు వింటేనే ఊటీ గుర్తుకొస్తుంది. అందుకే దీనిని ఆంధ్రాఊటీ అని, పేదవాడి ఊటీ అని పిలుస్తుంటారు. ప్రకృతి ప్రేమికులకు హార్సిలీహిల్స్ అందాలు కట్టిపడేస్తుంటాయి. మండు వేసవిలో చల్లగా ఉంటుందని, హాయిగా సేద తీరవచ్చని ఆశిస్తూ ఇక్కడికి వస్తుంటారు. చలికి వణికిపోవడంతో పాటు, ఫ్యాన్లు, ఏసీలు ఆఫ్ చేస్తుంటారు. అయితే ఇవన్నీ గతం. ప్రస్తుతం దెబ్బతింటున్న పర్యావరణం ఫలితంగా హార్సిలీహిల్స్ వాతావరణం వేగంగా మారిపోతోంది. చల్లదనం మాట దేవుడెరుగు..ఏసీలు, ఫ్యాన్లు లేకుంటే ఉండలేని దుస్థితి వచ్చేసింది. వేసవిలో కొండపై నమోదయ్యే ఉష్ణోగ్రతలకు భిన్నంగా నమోదవుతోంది. భవిష్యత్తులో దీనికి ఉన్న ఆంధ్రాఊటీ పేరు తొలగిపోయే పరిస్థితి దాపురిస్తోంది. ఆహ్లాదం అందించే కొండపై ప్రస్తుతం వేడి గాలులు వీస్తున్నాయి. ఉక్కపోత భరించలేకపోతున్నారు.

వేడి సెగలు

మండు వేసవిలో హార్సిలీకొండపై సాధారణ ఉష్ణోగ్రత 27 డిగ్రీలకు మించదు. ప్రస్తుతం నమోదవుతున్న ఉష్ణోగ్రతల్లో ఊహించని తేడా కనిపిస్తోంది. బుధవారం మధ్యాహ్నం కొండపై 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇది తీవ్రమైన ఎండ. ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైందంటే..నెలాఖరులోగా ఏ స్థాయికి చేరుతుందో అని ఆందోళన కలిగిస్తోంది. ఈ వేసవిలో ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు చేరుకునే పరిస్థితి ఉండవచ్చని భావిస్తున్నారు. చల్లదనం కోసం కొండకు వచ్చినా మైదాన ప్రాంత ఉష్ణోగ్రతలే ఉండటంవల్ల సందర్శకులు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. కొండపై గాలి వీచని పరిస్థితుల్లో వేడి అధికమై చమటలు పడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం కొండపై వాణిజ్యపరమైన కార్యక్రమాలు అధికం కావడం. హోటళ్లు, అతిథిగృహాలు పెరిగిపోతున్నాయి.ఎక్కడి చెత్త అక్కడే. వినియోగించి పారబోసిన ప్లాస్టిక్, కాంక్రీటు నిర్మాణాలు పెరగడం, సెల్ టవర్ల రేడియేషన్, కొండపై చుట్టూ ఉన్న దట్టమైన అడవి క్షీణిస్తున్న కారణంగా ఇక్కడి ఉష్ణోగ్రత అధికమవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏసీ, ఫ్యాన్లు ఉంటేనే..

కొండపై పెరిగిన ఉష్ణోగ్రతల ఫలితంగా టూరిజం, ప్రైవేటు అతిథి గృహాల్లో ఏసీ గదులనే పర్యాటకులు డిమాండ్ చేస్తున్నారు. కొండపై ఎండ, వేడిమి గతంకంటే ఎక్కువైంది. పర్యాటకులు గదుల్లోంచి సాయంత్రమైతేకాని బయటకు రావడం లేదు. వేడికి తాళలేక ఫ్యాన్లు, ఏసీలు వేసుకొని నిద్రించాల్సి వస్తోంది. ఈ ఉష్ణోగ్రతల ప్రభావం పర్యాటకులపై కనిపిస్తోంది. తమిళనాడు, కర్ణాటక నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గిపోయింది.

వడ దెబ్బ.. జర జాగ్రత్త.!

- ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- తగిన చర్యలు తీసుకోకుంటే ప్రాణాంతకమే
- ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి



మదనపల్లె సిటీ: జిల్లాలో వేసవికాలం ప్రారంభంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎల్‌నినో(వెచ్చని గాలి ప్రవాహం) ప్రభావంతో ఏప్రిల్ ద్వితీయార్థంలో పెరగాల్సిన ఉష్ణోగ్రతలు మార్చి నెలాఖరు నాటికే భయపెడుతున్నాయి. జిల్లాలో సుమారు 36 నుంచి 39 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రోజు రోజుకు ఎండ తీవ్రత అధికం కావడంతో భానుడి భగభగలు మిన్నంటుతున్నాయి. ఈ వేసవి సీజన్ ముగిసే నాటికి సాధారణ ఉష్ణోగ్రతల కంటే దాదాపు మూడు డిగ్రీల వరకూ అధికంగా నమోదు అవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీని వల్ల వృద్ధులు, చిన్నారులు, మహిళలు, రోగ నిరోధకశక్తి తగిన మోతాదులో లేని అనారోగ్య తీవ్రత ఉన్న వారు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. జిల్లాలో గత రెండు రోజులుగా ఎండ వేడిమి తీవ్రత ఎక్కువైంది. ప్రధానంగా పెనగలూరు, నందలూరు, రాయచోటి, వీరబల్లి, ఓబులవారిపల్లె, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు , చిన్నమండెం మండలాల్లో సగటున 38–39 డిగ్రీల మధ్య నమోదు అవుతోంది. చల్లగా ఉండే మదనపల్లెలో సైతం 36–37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం .

లక్షణాలు..

- శరీర ఉష్ణోగ్రత అమాంతంగా పెరిగిపోవడం
- చెమట పట్టకపోవడం, వణుకు పుట్టడం
- పాక్షికంగా ఫిట్స్ రావడం లేక అపస్మారస్థితికి చేరుకోవడం
- మగత నిద్ర రావడం, కలవరింతలు పలకడం
- పెదవులు ఎండిపోయి నోరు పిడచకట్టుకుపోవడం

వేసవిలో చేయాల్సినవి..

- రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తరచూ సేవించాలి.
- లేతరంగు కలిగిన తేలికగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పుడు బయటకు వెళితే గొడుకు లేదా టోపీ ధరించాలి. లేకుంటే తలకు రుమాలు చుట్టుకోవాలి.
- ఇంట్లో కిటికీలు తెరిచి గదిలోకి గాలి వచ్చి చల్లబడే విధంగా చర్యలు తీసుకోవాలి.

వేసవిలో చేయకూడనివి..

- మండు వేసవిలో మధ్యాహ్నం 12 నుంచి సాయంకాలం 4 గంటల వరకూ బయట తిరగరాదు.
- సూర్యకిరణాలు, వేడి గాలులు నేరుగా తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- రహదారులపై విక్రయించే ఆహార పానీయాలు, రంగునీళ్లు సేవించరాదు.
- ఎండ వేళల్లో శరీరంపై భారం పడే పనులు చేపట్టరాదు.
- ముదురు, నలుపు రంగు దుస్తులు ధరించరాదు.
- వేడి అధికంగా ఉన్న ప్రదేశాలో పని చేయరాదు.

వడదెబ్బ అంటే..

వేసవి దృష్ట్యా ఎండ తీవ్రత ఉన్న సమయంలో మానవుని శరీరంలో సంభవించే ఉష్ణోగ్రతలను తట్టుకోవడం లేదా నియంత్రించే శక్తి విఫలం కావడం వల్లే ఈ వడదెబ్బ సంభవిస్తుంది. సరైన మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోకుండా ఉండటం కాని, తీవ్ర వ్యాయామం లాంటి చురుకైన, శక్తికి మించి పనులు చేయడం వల్ల కాని ఈ వడదెబ్బ బారిన పడతారు. ఈ వేడిగాలుల వల్ల వడదెబ్బ (హీట్‌స్ట్రోక్) ,శరీరంలో లవణాలు కోల్పోవడం (డీ హైడ్రేషన్)తో కలిగే దుష్పరిణామాల వల్ల ఒక్కొక్కసారి ప్రాణాంతకంగా మారుతుంది. వేసవి కాలంలో వడదెబ్బకు గురైన వ్యక్తి సత్వరమే ప్రాథమిక చికిత్స తీసుకుని తగిన జాగ్రత్తలు, నివారణ చర్యలు పాటిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని వైద్య ఆరోగ్యశాఖ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని ఏరియా, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోను ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తోంది.

ప్రథమ చికిత్స ఇలా...



వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చి గాలి తగిలేలా చేయాలి. శరీరం సాధారణ స్థాయి ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ నీటిని తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మార స్థితికి వెళ్లిన రోగికి నీరు తాగించకూడదు.

–డాక్టర్ ఎ.వెంకటరామయ్య, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ,తంబళ్లపల్లె

క్లుప్తంగా

యువకుడికి విద్యుత్ షాక్

మదనపల్లె : విద్యుత్‌షాక్‌తో యువకుడు గాయపడిన సంఘటన బుధవారం రామసముద్రం మండలంలో జరిగింది. చెంబకూరు పంచాయతీ కట్టేవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్ (23) సమీపంలోని పొలం వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు దిమ్మె నిర్మిస్తుండగా అక్కడ పని చేసేందుకు వెళ్లాడు. మట్టిని దిమ్మె మధ్యలో నింపుతుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తండ్రి, కుమారుడికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహన ప్రమాదంలో తండ్రీ, కొడుకు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. తరిగొండకు చెందిన శ్రీనివాసులు (45) పశువుల దళారీగా పనిచేస్తున్నాడు. అతడి కుమారుడు మోహిత్(16) ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశాడు. పశువుల వ్యాపారానికి వెళ్లేందుకు బయలుదేరుతూ కుమారుడిని వెంటబెట్టుకుని ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. రామాపురం మార్గంలోని గంగిరెడ్డిపల్లె వద్ద మరో ద్విచక్రవాహనం అడ్డుగా వచ్చి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు, మోహిత్ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో బాధితులను తిరుపతికి రెఫర్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వ్యక్తి ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. రామారావుకాలనీకి చెందిన రామాంజులుకు (33) గత కొంత కాలంగా భార్యతో విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో కుటుంబసమస్యలతో మనస్తాపం చెంది ఇంటి వద్ద జిల్లేడు పాలు, ఎలుకల మందు కలిపి తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐసీయు విభాగంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

కుక్కల దాడిలో గాయపడిన దుప్పి



అడవిలో నుంచి దారితప్పివచ్చిన దుప్పి

రాజంపేట : మండలంలోని తాళ్లపాక గ్రామానికి ఓ దుప్పి దారితప్పివచ్చింది. ఈ దుప్పిని కుక్కలు వెంటపడి గాయపరిచాయి. అయితే ఆ దుప్పి కుక్కల బారినుంచి తప్పించుకుని గ్రామంలోని ఓ ఇంటిలోకి ప్రవేశించింది. ఇది గమనించిన గ్రామస్తులు గాయపడిన దుప్పిని పట్టుకుని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఓటరు నమోదుకు త్వరపడాలి

ఆఖరు గడువు ఈనెల 15



కడప సెవెన్‌రోడ్స్ : పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయాలనుకుంటున్నారా? అయితే ఓటరుగా నమోదు కాలేకపోయామని బాధపడుతున్నారా? మీకు ఆ చింత అవసరం లేదు. ఓటరుగా నమోదు కావడానికి ఈనెల 15వ తేదీ వరకు భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇప్పటికే ఓటర్ల తుది జాబితా ప్రకటించారు. 18 సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులు ఇంకా ఎవరైనా మిగిలి పోయి ఉంటే ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నది ఈసీఐ ఉద్దేశ్యం. గడువు సమీపిస్తోంది. మరి ఇంకెందుకు ఆలస్యం...

- అర్హులైన పౌరులు తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ఇంకా అవకాశం ఉంది. నేషనల్ ఓటర్స్ సర్వీసు పోర్టల్‌ను ఆశ్రయించాలి. డబ్ల్యు. డబ్ల్యు. డబ్ల్యు.ఎన్‌వీఎస్‌పీ. ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫారం-6 భర్తీ చేయాలి. ఎక్కడ ఎన్‌రోల్ కావాలనుకుంటున్నారో ఆ పోలింగ్ కేంద్ర పరిధిలో సాధారణ నివాసం ఉండాలి. ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇటీవల తీసిన పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫోటో జతపరచాలి. అలాగే ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, బ్యాంకు పుస్తకం, రేషన్‌కార్డు, తాజాగా చెల్లించిన వాటర్, టెలిఫోన్, ఎలక్ట్రిసిటీ, గ్యాస్ కనెక్షన్ల బిల్లులలో ఏదో ఒకటి రెసిడెన్స్ ప్రూఫ్‌గా సమర్పించాల్సి ఉంటుంది.
- 18 ఏళ్లు నిండిన పౌరులు మాత్రమే అర్హులు గనుక తమ వయస్సును నిర్ధారించే బర్త్ సర్టిఫికెట్, స్కూలు లీవింగ్ సర్టిఫికెట్, టెన్త్ లేదా ఇంటర్ మార్కుల జాబితాల్లో ఏదో ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. ఇదే కాకుండా ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న వ్యక్తులు గుగూల్ ప్లే స్టోర్‌లో నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో ఫారం-6 భర్తీ చేసి అవసరమైన డాక్యుమెంట్లను జతపరచాలి. ఓటరు నమోదు కోసం తాము సమర్పించిన దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునేందు కోసం ఎన్నికల కమిషన్ హెచ్‌టీటీపీఎస్ ://ఎలక్టోరల్‌సెర్చ్.ఇన్/లోకి వెళ్లి పరిశీలించాలి.

ఆఫ్‌లైన్‌లోకూడా దరఖాస్తు సమర్పించే అవకాశం ఉంది. తమ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లేదా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (తహసీల్దార్) కార్యాలయాలకు వెళితే ఫారం-6 దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయి. రెండు కాపీలను భర్తీచేసి, కావాల్సిన డాక్యుమెంట్లు జతపరిచి వారికి సమర్పించాల్సి ఉంటుంది. అదీ కాకపోతే బూత్ లెవెల్ అధికారులకు ఫారం-6 సమర్పించినా సరిపోతుంది. ఇప్పుడు నమోదయ్యే ఓటర్ల పేర్లు ముద్రించి ప్రత్యేక జాబితాను ప్రభుత్వం విడుదల చేస్తుంది.

పేరు చెక్ చేసుకోండిలా..

తమ ఓటు ఎప్పటినుంచో ఉందని చాలామంది ధీమాతో ఉంటారు. తీరా పోలింగ్ రోజు ఓటు వేసేందుకు వెళితే ఉండకపోవడంతో చేసేది లేక నిరాశగా వెనుదిరగాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తనిఖీ చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచిస్తున్నారు. ఇందుకు ఓటర్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి ఇప్పుడే చెక్ చేసుకోవాలి. ఒకవేళ పేరు లేకపోతే ఆలస్యం లేకుండా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రామసముద్రం : రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లి పంచాయతీ పురాండ్లపల్లి కొత్త చెరువు వద్ద మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. వై.అశోక్ లేలాండ్ వాహనంలో వరిగడ్డితో పలమనేరు నుంచి చొక్కాండ్లపల్లి వెళుతున్నాడు. మార్గ మధ్యలో పురాండ్లపల్లి వద్ద విద్యుత్ లైన్ వాహనంపై గడ్డికి తాకడంతో నిప్పురవ్వలు పడి అగ్నిప్రమాదం జరిగినట్లు వాహన డ్రైవర్ తెలిపారు. విషయం తెలుసుకున్న పుంగనూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో వచ్చి నీటిని చల్లి మంటలను ఆర్పారు. సుమారు రూ.3 లక్షలు వరకు నష్టం వాటిల్లినట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక ఆఫీసర్ సుబ్బరాజు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

80 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన మైనార్టీ నాయకులతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పార్టీలో చేరిన నాయీ బ్రాహ్మణులతో ఉప ముఖ్యమంత్రి



వీఎన్ పల్లె : పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు పి. గురుస్వామి, వృత్తి సంఘ విభాగం అధ్యక్షుడు జి. సురేష్ బాబు ఆధ్వర్యంలో 80 నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఐటీఐ సర్కిల్ సమీపంలోని కళ్యాణ మండపంలో నిర్వహించిన నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సభలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించిన నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానని బెదిరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఎస్. సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చాక్లెట్ గౌస్, షఫీ, మున్నా, రమేష్‌రెడ్డి, జహీర్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక..

కడప నగరంలోని సాయిపేటలో తెలుగుదేశం పార్టీ నుంచి 50 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం సాయంత్రం టీడీపీ నేత ఖలీల్ ఆధ్వర్యంలో చేరిన వారందరికీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ఖలీల్ మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, నగర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, అజ్మతుల్లా, బసవరాజు, చాంద్‌బాషా, మియ్యా, రిజ్వాన్, రమేష్‌రెడ్డి, కె. కొండయ్య, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచుతో పాటు 70 కుటుంబాలు చేరిక

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 70 కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సమక్ష్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారు మాజీ సర్పంచు పెద్ద ఓబులేసు, ఓబులేసు, రెడ్డెయ్య, వెంకటలక్షుమ్మ, బుజ్జమ్మ, రేవతి, బ్రహ్మయ్య, ఆనంద్, శివ, నారాయణ, భద్రి, శ్రీనివాసులు, మురళి, గోపాల్, వెంకటక్రిష్ణ, గోవిందు వారితో పాటు మరో 43 కుటుంబాలవారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచు నరేష్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం ఛైర్మన్ శివాంజనేయరెడ్డి, కాంట్రాక్టర్ శ్రీనివాసుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి సిద్దారెడ్డి

మైదుకూరు : కొద్ది రోజుల కిందట ప్రొద్దుటూరులో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి బంధువు, మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు మండలం నక్కలదిన్నెకు చెందిన శెట్టిపల్లె సిద్దారెడ్డి బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. సిద్దారెడ్డికి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువా వేసి తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రలోభపెట్టి టీడీపీ వారు వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలను చేర్చుకుంటున్నారని విమర్శించారు. పార్టీపై అభిమానంతో మనస్ఫూర్తిగా చేరాలి కానీ, ప్రలోభాలతో లొంగదీసుకోవాలని చూస్తే సత్ఫలితాలను ఇవ్వదని పేర్కొన్నారు. శెట్టిపల్లె సిద్దారెడ్డి మాట్లాడుతూ తనను ప్రలోభపెట్టి చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి, తనకు ఇష్టం లేకపోయినా కండువా వేశారని ఆరోపించారు. తాను వైఎస్ కుటుంబాన్ని, తన పెదనాన్న రఘురామిరెడ్డి, అన్నయ్య శెట్టిపల్లె నాగిరెడ్డిలను వదిలి వెళ్లే ప్రసక్తే లేదని అన్నారు. చంద్రబాబు సమక్షంలో చేరిన తమ బంధువులు కూడా తిరిగి వస్తారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, బీ.మఠం మండల జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, చాపాడు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పాల్గొన్నారు.



శెట్టిపల్లె సిద్దారెడ్డిని వైఎస్సార్‌సీపీలో చేర్చుకున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

నానుబాలపల్లెలో...

మైదుకూరు మున్సిపాలిటీ నాలుగవ వార్డు పరిధిలోని నానుబాలపల్లెకు చెందిన పలువురు బుధవారం తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన పలువురిని మంగళవారం టీడీపీ నేతలు ఆ పార్టీలో చేర్చుకున్నారు.

అయితే తమను ప్రలోభపెట్టడం వల్లే టీడీపీలో చేరామన్నారు. సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును మరిచిపోలేక తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వచ్చామని వారు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఎద్దుల ఏసోబు, సుకుమార్, బొజ్జ రాజు, చిట్టిబాబు, తిరుమలయ్య తదితరులు బుధవారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామదాసు, గోశెట్టి లక్షుమయ్య సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

ముస్లింలకు మేలు చేసింది వైఎస్ కుటుంబమే

మైదుకూరు : ముస్లింలకు మేలు చేసింది కేవలం వైఎస్ కుటుంబం మాత్రమేనని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు పట్టణంలోని 14వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ నుంచి 100 కుటుంబాలకు చెందిన ముస్లిం మైనారిటీలు వైఎస్సార్‌సీపీలో చేరారు. 14వ వార్డు టీడీపీకి చెందిన పెద్ద జమాల్ వలి, ముస్తఫా, ఖాదర్‌బాషా, ఖలందర్, షరీఫ్, బేల్దారి కమాల్, అల్తాఫ్, హసేన్, మహబూబ్ బాషా, బాబా మియా, దస్తగిరి, నూరున్, జమీల, మహబూచాన్, అక్తర్ తదితర 100 కుటుంబాల వారు వార్డు ఇన్‌చార్జి ఖాదర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, బీ.మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షరీఫ్, వనిపెంట సర్పంచ్ గౌస్ లాజం, ఎంపీటీసీ ఇర్షాద్, షౌకత్, ముజాఫర్, నాయిబ్ రసూల్, గౌస్, సన్న శీనురావు, మామిళ్లపల్లె దస్తగిరి, వీరభద్రుడు పాల్గొన్నారు.

ఈద్గా ప్రహరీ పరిశీలన ..

పట్టణంలో ఈద్గాకు నిర్మించిన ప్రహరీని బుధవారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

రూ. 4 లక్షలు పట్టివేత

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ రింగ్‌రోడ్డు శివార్లలో ఎలాంటి రశీదులు లేని రూ.4లక్షల నగదును పట్టుకొని ట్రెజరరీలో అప్పగించినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణ పరిధిలోని రాయచోటి - మదనపల్లె రోడ్డులోని రింగ్ రోడ్డు వద్ద రెడ్డిశేఖర్ అనే వ్యక్తి తన కారులో రూ.4లక్షలు నగదు తీసుకెళుతుండగా గుర్తించామని.. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఆ మొత్తాన్ని రాయచోటి ట్రెజరరీలో జమ చేసినట్లు సీఐ తెలిపారు.

రూ.లక్ష సీజ్

కలకడ : ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష ను సీజ్‌చేసినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కె.బాటవారిపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లేకుండా వాహనంలో రూ.లక్ష తరలిస్తుండగా నగదు సీజ్ చేసి రాయచోటి ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేసినట్లు తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా



భాకరాపేట వద్ద కల్వర్టులో బోల్తాపడిన ఆటో

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న కల్వర్టులో బుధవారం అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. బద్వేల్‌కు చెందిన ఆటో డ్రైవర్ నిత్యపూజయ్య బద్వేల్ నుంచి చీనికాయల లోడుతో కడపకు వస్తుండగా.. భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు వద్దకు రాగానే అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణీకులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు అన్నారు. డ్రైవర్ నిత్యపూజయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాలు జరగకుండా కల్వర్టు వద్ద రక్షణ గోడ నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జింకను చంపిన హైనా



హైనా దాడిలో మృతి చెందిన జింక

పెద్దతిప్పసముద్రం : పీటీఎం సమీపంలోని బోడిగుట్ట పరిసర ప్రాంతాల్లో 15 రోజులుగా ఓ హైనా రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. హైనా భయంతో రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకే వెనకడుగు వేస్తున్నారు. ఈ మధ్య కాలంలో బోడిగుట్ట సమీపంలో మామిడి చెట్లను కౌలుకు తీసుకున్న బూరగ రవనప్ప అనే రైతు నీళ్లను పారగడుతుండగా అప్పటికే చెట్టులో ఉన్న హైనా ఒక్కసారిగా కిందకు దూకడంతో రైతు హడలెత్తి ఊరిలోకి పరుగులు పెట్టాడు. అయితే అప్పటికే నెల రోజుల వయసు ఉన్న ఓ దూడను హైనా చంపిన విషయం పాఠకులకు తెలిసిందే. అయితే మామిడి చెట్లను కౌలుకు తీసుకున్న తోటలోనే మంగళవారం రాత్రి హైనా దాడిలో ఓ జింక మృతి చెందింది. ఈ విషయాన్ని బుధవారం గుర్తించిన కౌలు రైతు బూరగ రవనప్ప జరిగిన సంఘటనను అటవీ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. 'ఇప్పుడు మేమైతే ఏం చేయలేం, ఈ విషయాన్ని రచ్చ చేయకుండా ఆ జింకను గుట్టుగా పాతేయమని' అధికారులు చెప్పారని రైతు అంటున్నాడు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎర్రగుడిపాడు-కమలాపురం రైల్వేస్టేషన్ మధ్యలో గల రైలు పట్టాలపై ఒక గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని బుధవారంవ కడప రైల్వే సీఐ బి.నాగార్జున తెలిపారు. మృతుడికి 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని గర్తించిన వారు రైల్వే సీఐ 94406 27398, రైల్వే ఎస్‌ఐ 94409 00811 నెంబరులో సంప్రదించాలన్నారు.

బస్సులో వస్తూ గుండెపోటుతో వృద్ధుడి మృతి



అంగళ్లులో చనిపోయిన వృద్ధుడు అహ్మద్ బాషా

కురబలకోట : బస్సులో ప్రయాణిస్తూ ఓ వృద్ధుడు గుండె పోటుతో మృతి చెందిన విచారకర సంఘటన బుధవారం అంగళ్లులో చోటుచేసుకుంది. గుర్రంకొండకు చెందిన అహ్మద్ బాషా (63) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. అనంతరం మదనపల్లె ఆర్టీసీ డిపో నుండి గుర్రంకొండకు బయలు దేరాడు. అంగళ్లు వద్దకు బస్సు రాగానే ఆ వృద్ధుడు ఒక్కసారిగా స్పృహ తప్పాడు. దీంతో వెంట ఉన్న కోడళ్లు అతనికి నీళ్లు తాపించడానికి హుటాహుటిన బస్సు నుండి కిందకు దింపారు. కోడళ్లు సపర్యలు చేస్తుండగానే అతడు ప్రాణం విడిచాడు. మృత దేహాన్ని స్వగ్రామం గుర్రంకొండకు తరలించారు. జీవితం ఒక ప్రయాణం లాంటిదంటారు. అతను ప్రయాణంలోనే జీవితాన్ని చాలించడం పట్ల ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణీకులు, స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

ఇష్టంతో విద్యనభ్యసించాలి

అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి



రాజంపేట : నేటి యువతీ, యువకులు మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త ఆలోచనలతో ఇష్టంతో విద్యనభ్యసించాలని నూతనంగా ఏర్పాటైన అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీఎస్‌లో సీజీఆర్ టాలెంట్‌మీట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. ఏఐటీఎస్ యాజమాన్యం నిర్వహించే టాలెంట్‌మీట్‌లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డా. జయరామిరెడ్డి మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యను అభ్యసిస్తూ ముందుకు సాగితే సాధించలేనిది ఏమీ ఉండదన్నారు. డా.సుబ్బారావు మాట్లాడారు. అనంతరం ప్రొఫెసర్ జయరామిరెడ్డిని ఏఐటీఎస్ వైస్‌ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందచేశారు. టాలెంట్‌మీట్‌లో హెచ్‌వోడీలు డా.హేమంత్, డా.పద్మలలిత, డా.నరేష్‌కుమార్, డా.సీహెచ్ నాగరాజులతోపాటు మెకానికల్, సివిల్, ఈసీఈ బ్రాంచిలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికపై కుక్కల దాడి



చికిత్స పొందుతున్న రూపశ్రీ

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నంపల్లిలో బుధవారం రాత్రి గుడికి వెళ్లి వస్తున్న చవ్వాకుల రూప శ్రీ అనే 10 సంవత్సరాల బాలికను కుక్కలు దాడి చేసి కరిచాయి. తల్లిదండ్రులతో గుడికి వెళ్లిన రూప శ్రీ గుడి బయటికి రాగానే కుక్కలు చుట్టుముట్టి దాడి చేయడంతో కాలికి రక్త గాయం అయింది. వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.